


# 28

# ముఖాముఖం

పేవ్‌మెంటు మీద నడుస్తూ, ఒక్కసారిగా ఉలిక్కిపడింది మాలతి. చుట్టుపక్కల వున్న పరిసరాలన్నీ ఫ్రీజ్ అయి, వెనుక ఫొటోఫ్రేమ్‌లా నిలిచిపోతే తానొక్కతే అట్లా నడిచిపోతున్నట్టుగా అనిపించింది.

మే నెల ఎండ. షెల్టర్ల కింద, హోటళ్ల ముంగిట గుంపులు గుంపులుగా నిలబడ్డారు జనం. సిటీ బస్సులు, ఒకటో ఆరా కార్లు తప్ప, రోడ్డుపై పెద్దగా చలనం లేదు.

కదలిక లేని చెట్ల ఆకులవైపు నిర్లిప్తంగా చూసుకుంటూ, ఇట్లా ఎండలో నడుచుకుంటూ వెళ్లే కంటే, ఆటోలో వెళితే బావుండు అనుకుంది. పర్స్ తడుముకుంది. ఓ ఇరవై, మరికాస్త చిల్లర ఉన్నట్లు గుర్తు. ఇప్పుడు ఆటో అంటే పదో, పదిహేనో ఖర్చు అవుతాయి. ఇట్లాగే నాలుగడుగులు వెయ్యగలిగితే బ్రిటీష్ లైబ్రరీ వస్తుంది. అక్కడ ఓ రెండు గంటలు గడిపి, కాస్త చల్లబడ్డాక నడక సాగించవచ్చు అనుకుంది. నాలుగు గంటలకు రిహార్సల్, తప్పక రమ్మంటూ బల వంతపెట్టాడు శివం. ఈ రిహార్సల్, ఈ నాటకాలు ఇవన్నీ ముగిసిన అధ్యాయాలు. తలుపులన్నీ మూసివేసుకుని, ఇంక ఇక్కడ ప్రదర్శనలు జరగవు అని బోర్డు వేలాడదీసుకున్న స్టేజీలా ఉంది మనసు. నేను రాలేను అంటున్నా శివం వినలేదు. కనీసం ప్రేక్షకురాలిగా రా అంటూ బలవంతపెట్టాడు.

ఆర్‌బీఐని, ఏజీ ఆఫీసుని దాటుకొని అట్లా ముందుకుపోతే చౌరస్తాలో ఒక చిర పరిచితమైన దృశ్యం. హోమ్‌సైన్స్ కాలేజీ ఎదురుగా అమ్మాయిలు మూగి ఉన్నారు. ఈవ్స్ వీక్లీవాళ్లు ఏర్పాటు చేస్తున్న బ్యూటీ కాంటెస్ట్‌ని బహిష్కరించమంటూ నినాదాలు ఇస్తున్నారు. మొత్తం పదిహేనుమంది కూడా ఉండరు. హోమ్‌సైన్సు కాలేజీ అమ్మాయిలు వింతగా చూస్తున్నారు గేటు దగ్గర నిలబడి. రోడ్డుపై వెళ్లే వాళ్లకి కరపత్రాలు పంచుతూ నిలబడ్డ అమ్మాయి మాలతివైపు ఆసక్తిగా చూసింది. పోలికలు గుర్తుపట్టి పలకరించే లోపల గబగబా ముందుకు అడుగులు వేసింది మాలతి.

కొన్నాళ్ల క్రితం, ఇట్లాంటి ఉద్యమాలే జీవితంగా గడిపింది మాలతి. ఇప్పుడా ఉద్రేకం చల్లారిపోయింది. ఆ జీవితం, అనుభవాలు, అవి తనవేనా అని విస్తుపోతుంది. కసి లాంటిదేదో ముప్పిరి కొనగా తన జ్ఞాపకాల్లోంచి తీసేసుకుందా రోజుల్ని.

మలుపు తిరిగి సెక్రటేరియట్ రోడ్డుపైకి వచ్చింది. పేవ్‌మెంట్ పొడవునా ఉన్న అశోక వృక్షపు నీడలు వింత ఓదార్పునిచ్చాయి. ఏ పచ్చని చెట్టును చూసినా మాలతిలో సంచలనం కలుగుతుంది. పరవశాన్ని కలిగించే సంగీతాన్ని వింటున్నట్లుగానో, బాల్యంలోకి పున: ప్రయాణిస్తున్నట్లు గానో, ఎండిన నాలుకపై అమ్మ స్తన్యపు బొట్లు తటాలున రాలి నట్లుగానో అనిపిస్తుంది. అన్ని అనుబంధాల్ని ఛేదించుకున్నా ఈ సెంటిమెంటును మాత్రం వదుల్చుకోలేకపోయింది. టైమ్ రెండు కావస్తుంది. ఇందాకటి గుంపులోంచి ఎవరో తనను పేరుపెట్టి పిలుస్తున్నట్లుగా తోచి, అడుగుల వేగాన్ని పెంచింది. పలాయనమా? ఊహు కాదు. గట్టిగా సమాధానం చెప్పుకుంది.

బ్రిటీష్ లైబ్రరిలో పెద్దగా సందడి లేదు. వద్దనుకుంటూనే పర్యావరణానికి సంబం ధించిన పుస్తకం తీసుకుంది. 'గ్రీన్ ఎర్త్' బ్రిటన్‌వాళ్ల పర్యావరణ పత్రిక, అంతా సొల్లు. ఏసీ గదుల్లో కూర్చుని పర్యావరణం మీద థీసీస్‌లు రాస్తారు. ఒక చెట్టును నాటని వాళ్లకు, అడవుల విశృంఖలతను ప్రేమించలేనివాళ్ళకు పర్యావరణం గురించి మాట్లాడే హక్కు లేదు. డామిట్! అంటూ పుస్తకాన్ని ముందుకు విసిరింది. శబ్దానికి అటూ ఇటూ ఉన్న ముఖాలన్నీ ఆమెవైపు తిరిగాయి. ఇబ్బందిగా చూసి, అంతలోనే సర్దుకొని నవ్విపోదురుగాక నాకేమి అనుకుంది. బరువైన ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికాని తెచ్చుకొని 'ది ట్రైబ్స్ ఆఫ్ ఇండియా' అనే అంశాన్ని వెతుక్కొని చదవటం మొదలుపెట్టింది.

'హలో!' పరిచయమైన గొంతు వినిపించి తల పైకెత్తింది. రాజు. మెడికల్ స్టూడెంట్. హలో చెప్పిన తరువాత అతనితో ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. ఈ హలో తరువాత మాటల్ని పెగల్చడానికి ఎంతో పెనుగులాడాల్సి వస్తుంది. లోలోపల విసుగు. అట్లా అతను ఎదురుపడినందుకు, ఎదురుపడ్డ ఆ మనిషితో తను ఫ్రీగా మాట్లాడలేకపోతు న్నందుకు.

"రండి! అట్లా సరోవర్ దాకా వెళ్లి కాఫీ తాగివద్దాం!" అంటూ లేచాడు. అది అభ్యర్థనో, ఆజ్ఞో తేల్చుకోకుండానే అతని వెంట నడిచింది. 'ఎక్సర్‌సైజులు చేస్తున్నారా' అడిగాడు. 'ఊ' అంటూ ఓ శబ్దాన్ని బయటకు విసిరింది. "వారంరోజులుగా ఫిజియోథెరపీ యూనిట్ చుట్టూ తిరుగుతున్నాను, మీరు కనిపిస్తారేమోనని!"

'ఇతనెందుకు నా గురించి తిరగడం, ఇతని మాటల్లో ఇంత చనువెందుకు,' మాలతికి చాలా అసహనంగా ఉంది. 'ఇతనే కాదు, ఈ వయసు మగవాళ్లు చాలామంది ఇట్లాగే. పదినిమిషాలు ఒంటరిగా వాళ్లతో గడిపితే, ఆ స్త్రీలమీద వాళ్లకేవో హక్కులు వచ్చినట్లుగా భావించుకొంటారు. డామిట్!' అనుకొంది మాలతి.

ఎండలో మిలమిలలాడుతోంది బిర్లామందిర్. కొండపై నుండి ఠీవిగా, పొగరుగా కనిపిస్తోంది. ఆ పక్కనే ఉన్న కొండల నలుపు చూసి విసుక్కున్నట్లుగా ఉంది. పోలికను తల్చుకొని సన్నగా నవ్వుకొంది. వర్గ మనస్తత్వం అంటే ఇదేనేమో అనుకుంది. "ఎందుకు నవ్వుతున్నారు?" అన్నాడతను. 'ఓహ్! ఈ నక్షత్రకుడు పక్కనున్న సంగతే మర్చిపోయాను,' అనుకుంది లోలోపల.

మొహమాటపడకుండా అతను తెప్పించిన ఇడ్లీ, దోసె తినేసింది. కాఫీ తాగుతుండగా, కళ్లలోకి సూటిగా చూస్తూ, "ఆ రోజు మీరు అన్నది తమాషాకు కదూ!" అన్నాడు. 'అతని కళ్లలో ఉన్నదేమిటి? సందేహమా! భయమా!' అర్థం కాలేదు మాలతికి. సుమారు పదిహేను రోజుల క్రితం ఫిజియోథెరపి యూనిట్‌లో కలిసి, "రండి మా రూమ్ చూద్దురు గాని!" అంటూ ఆహ్వానించాడు. శరీరమంతా విపరీతమైన నొప్పులు. ఫ్రాక్చర్ల పైని పిండి కట్లు తీసివేశాక స్టిఫ్‌నెస్ పెరిగి, ప్రతి కదలికా నొప్పిలో నుంచి పెనునొప్పిలోకి చేస్తున్న ప్రయాణంలా ఉంది. అంతకు ముందు మూడునెలల క్రితం ఒక రాత్రివేళ స్పృహలేని స్థితిలో మాంసపు ముద్దలా ఉన్న తనను క్యాజువాలిటీ వార్డులో పడేసి వెళ్లిన క్షణం నుంచి, బహుశా దయతోనో, వృత్తిపైన ఆరాధనతోనో లేదా మరే తెలియని కారణం చేతనో అతను ఎంతో సాయం చేశాడు. "మీరు చాలా మొండి మనిషి! అన్ని ఫ్రాక్చర్లయినా నిబ్బరంగా ఉండగలిగారు. మీరు మళ్లీ నడుస్తుంటే ఫీనిక్స్ బర్డ్ గుర్తుకొస్తుంది," అనేవాడు. వార్డులో ఉన్న రెండు నెలలు అతనే తనకు బంధువు. డిశ్చార్జి చేసిన తరువాత కూడా ఫిజియో థెరపిస్టు దగ్గరకు తీసుకువెళుతూ ఉండేవాడు.

హాస్పటల్ పై అంతస్తులో ఉంది అతని గది. పీజీలు, హౌస్‌సర్జన్లు ఉండే హాస్టల్. రూమ్ చూపిస్తాను అంటూ నన్ను వెంట తీసుకెళ్లిన ఆ సమయంలో ఆ గది నిర్మానుష్యంగా ఉంది. ఇంగ్లీషు పాటేదో హమ్ చేస్తోంది స్టీరియో. క్రమంగా పలచనవుతున్న సాయంకాలపు వెలుతురు. పిరికిగా, కంగారుగా గాడ్! అతని కళ్లలో కోరిక. విరక్తిగా నవ్వుకొంది మాలతి. ఇంతేనా మగవాడంటే అనే దిగులు ప్రశ్న ఉంది ఆ నవ్వులో.

"మిమ్మల్ని నిరుత్సాహపరుస్తున్నందుకు క్షమించండి. నాకు సిఫిలిసో, గనోరియానో, మీరు ఎస్.టి.డి. వ్యాధులంటారే వాటిలో కొన్ని ఉండే అవకాశముంది." అతని అంతరంగంలోని పెను విస్ఫోటన అతని ముఖంలో స్పష్టంగా తెలుస్తుంది. తెల్లగా పాలిపోయి, భయంతో కొయ్యబారి, 'చెప్పకపోయినా బాగుండేది' అని జాలిపడింది మాలతి. "యూనో! ఐయామ్ ఏ రేప్ విక్టిమ్!" ఆ తరువాత వివరాలు చెప్పడానికి గొంతు పెగల్లేదు. జుగుప్స లాంటి, అసహ్యం లాంటి, కసి లాంటి ఏదో భావన ఉవ్వెత్తున లేచింది ఆమె మనసులో.

హోటల్‌వాడు స్టీరియో ఆన్ చేశాడు. ఘజల్ ఏదో వినిపిస్తోంది శ్రావ్యంగా. ఆ ఉర్దూ పదాలకు అర్థం తెలియకపోయినా, ఆ పదాల్ని తేనెలో ముంచి తినిపిస్తున్నంత హాయిగా గానం చేస్తున్నారెవరో. రాజు చేతిలో కాఫీ కప్పుతో, సమాధానం కోసం ఎదురు చూస్తున్న ముఖంతో అలాగే చూస్తున్నాడు. మాలతికి సమాధానం చెప్పాలనిపించలేదు. అతని ఆసక్తి ఎవరిపైన? నా పైనా లేక నా శీలంపైనా? అతన్ని పట్టించుకోవడం మానివేసి కళ్లు మూసుకొని గజల్‌లోని శ్రావ్యతను ఆస్వాదించటం మొదలుపెట్టింది.

హోటల్ బయటికొచ్చాక మాలతికెందుకో మనసు తేలికైనట్టుగా ఉంది. మబ్బు తునక ఒకటి ఆకాశంలో ముసిరి, నగరంపై పెద్ద గొడుగేదో విప్పుకున్నట్లుగా ఉంది. సూర్యతాపం కాస్త తగ్గింది. అట్లా ట్యాంక్ బండ్ దాకా నడిచివెళ్లి ఏ వేమన నీడలోనో, శ్రీశ్రీ నీడలోనో కూలబడి, సంఘటనల్ని తాత్విక ధోరణిలోనో, మార్క్సిస్ట్ ధోరణిలోనో సమీక్షించుకుంటుంటే ఎంత బాగుంటుందో అనిపించింది. కానీ ఈ పక్కనున్న మనిషికి కాముక ధోరణి తప్ప మరోటి తెలిసినట్లు లేదు.

"ఎండ తగ్గినట్లుంది! రండి ట్యాంక్‌బండ్‌వైపు వెళ్దాం!" అంటూ ముందుకు అడుగువేశాడు. వెళ్లాలని కోరికున్నా, అతని గిరీశం మార్కు చూపుల్ని తప్పించుకోవడానికి, "సారీ అండీ! నాలుగింటికి నాకు రిహార్సలుంది. నేనిట్లా సెంట్రల్ యూనివర్సిటీవైపు వెళ్తాను. థాంక్యూ ఫర్ ది కంపెనీ!" అంటూ చకచకా అడుగు లేసుకుంటూ ముందుకు సాగింది మాలతి.

పేవ్‌మెంట్ పొడవునా కాన్వెంటు పిల్లలు. అప్పుడే స్కూళ్లు వదిలినట్లున్నారు. అల్లరి చేసుకుంటూ, హడావుడిగా పరిగెత్తుతున్నట్లుగా నడుస్తూ, నీలిరంగు నదీ ప్రవాహమేదో పక్కనే ప్రవహిస్తున్నట్లుగా ఉంది మాలతికి. మాలతిని తోసుకుంటూ ముందుకు వెళ్లిన ఒక పాప, వెనక్కు తిరిగి "ఎక్స్‌క్యూజ్‌మి ఆంటీ!" అంటూ కొంటెగా నవ్వింది. మాలతికి తన యూనివర్సిటీ రోజులు గుర్తుకొచ్చాయి. సిటీ బస్సులకోసం హడావుడిగా పరుగు లెత్తటం, తను దిగే చోటు వచ్చేదాకా పక్కవాళ్లతో ఏదో విషయం గురించి చర్చిస్తూనో వాదిస్తూనో గడపటం. శివం అంటూండేవాడు, 'నువ్వు పక్కనున్నంతసేపూ స్వేచ్ఛా

వాయువేదో ప్రసరించినట్లుగా ఉంటుంది,' అని తనదైన నాటకీయమైన ధోరణిలో. 'స్టూడెంట్స్ గ్రూప్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్' అంటూ పర్యావరణ రక్షణ గురించి ఒక వేదిక యూనివర్సిటీలో మొదలుపెట్టింది తనే. ఆ మీటింగులో మాట్లాడుతూ శివం, 'మాలతిని మనమింక ముద్దుగా మేధాపాట్కర్ అని పిలుచుకుందాం!' అంటూ గొప్ప కాంప్లిమెంట్ నిచ్చాడు. రీసెర్చిని మధ్యలో వదిలేసి 'ఫోకస్' సంస్థలో చేరాలనుకున్నప్పుడు, అందరూ నిరుత్సాహపరిచినా శివం ఒక్కడే తనను ప్రోత్సహించాడు. ఆ జ్ఞాపకాలన్నీ గుర్తు కొచ్చి, అంతట్లోనే పెను దిగులు ఆమెను ఆవహించింది. ఆ జ్ఞాపకాలన్నీ తనవి కానట్లుగా అపరిచితంగా మారాయి.

"ఏయ్ మాలతీ!" అనే పిలుపు విని, వెనక్కు తిరిగింది. ఎయిరిండియా ఆఫీసు ముందు నిలబడి కేక వేస్తోంది సుజాత. సుజాత పత్రికాఫీసులో సబ్ ఎడిటర్, కవయిత్రి, ఫెమినిస్ట్ ఉద్యమకర్త. మాలతి దగ్గరకు రాగానే గొప్ప ఉద్వేగంతో మాలతిని కౌగిలించు కొని, "ఏమిట్రా యిది. ఎందుకిట్లా జరిగింది. ఇంత టార్చర్, ఇంత దు:ఖం, ఇంత బాధ ఎట్లా ఓర్చుకున్నావు? నా తల్లీ! ఎందుకురా నీకీ శిక్ష!" అంటూ పెద్ద పెట్టున ఏడ్చింది. చుట్టుపక్కల ఉన్న పరిసరాలు, మనుషులు మాయమై ప్రపంచమంతా ఆ యిద్దరు స్త్రీలే అన్నట్లుగా ఒకళ్లనొకళ్లు కౌగిలించుకొని, ఒకానొక దుర్భరమైన సంఘటన తాలూకు బాధను పరస్పరం అనుభవిస్తూ అట్లా ఎంతసేపు గడిపారో వాళ్లకే తెలియదు. తేరుకున్నాక అటు పక్కనున్న ఎయిరిండియా ఆఫీసు మెట్లపై కూలబడ్డారు. మాలతి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని ప్రేమగా నిమిరింది సుజాత. ఆ స్పర్శలో ఓదార్పు, అమ్మతనం తోచాయి మాలతికి.

"శివం చెప్పేదాకా మాకెవరికీ తెలియదు. ఆ బాస్టర్డ్ మీ డైరెక్టర్ గొప్పగా మ్యానేజ్ చేశాడు. పేపరువాళ్లని, పోలీసుల్ని, అధికార్లని అందర్నీ కొనేసినట్లున్నాడు. కానీ వాణ్ణి వదల దానికి వీల్లేదు. వాణ్ణి, వాడి సంస్థని పేపర్లోకెక్కిస్తాను. వాడి అంతు చూసేదాకా నిద్రపోను. శివం యూనివర్సిటీ స్టూడెంట్లనీ, మిగతా వాలంటరీ ఆర్గనైజేషన్ వాళ్లను మొబిలైజ్ చేస్తున్నాడట," కోప తీవ్రతలో సుజాత ముఖం అదిరిపోయింది. "నువ్విక్కడ ఒక్కదానివే హాస్టల్‌లో ఎందుకు? ఇంటికి వెళ్లకూడదూ? ఆ హాస్పిటల్‌లో అన్నాళ్లు దిక్కులేనిదానిలా పడి ఉన్నావట! అమ్మకు కబురు చేస్తే బాగుండేది?"

"ఫోకస్‌లో చేరినప్పటి నుండి అమ్మా నాన్నా ముభావంగా ఉంటున్నారు. ఇప్పుడీ సంగతి తెలిస్తే, 'చెపితే వినలేదుగా! చూడు ఏమయిందో?' అంటూ విసిగిస్తారు. ఆ నిరసనలు, నిష్ఠూరాలు వినటం యిష్టం లేక హాస్టల్‌లోనే ఉన్నాను."

వాళ్లిద్దరూ అట్లా మాట్లాడుకుంటూనే ఉన్నారు. ఏజీ ఆఫీసులోంచి గుంపులు గుంపులుగా ఉద్యోగులు బయటకు రావడం మొదలుపెట్టారు. పంజరాలన్నీ ఒక్కసారిగా

తెరుచుకున్నట్లుగా, రోడ్డంతా కిక్కిరిసిపోయాయి. అప్పటికి వాతావరణం కాస్త చల్లబడింది. సుజాత లేచి, "వెళ్తానిక! నిజానికి నీ పని మీదే తిరుగుతున్నాను. ఆ ఫోకస్ వాళ్ళమీద స్కూప్ వేద్దామంటే మా ఎడిటర్ ఒప్పుకొని చావటంలా. ప్రొప్రయిటర్ని అడిగితే ఆరింటికి అప్పాయింట్‌మెంట్ ఇచ్చాడు. అయన్ను ఎట్లాగయినా ఒప్పించాలని బయల్దేరాను," అంటూ జనప్రవాహాన్ని చీల్చుకుంటూ లక్డీకాపూల్ వైపు బయల్దేరింది. సెంట్రల్ యూనివర్సిటీ వైపు అడుగులు వేసింది మాలతి.

యూనివర్సిటీ దగ్గరవుతుండగానే సంగీత పరికరాల చప్పుళ్లు రిథమిక్‌గా, హాయిగా చెవిన బడ్డాయి మాలతికి. కంజెర, డప్పు, గజ్జెలు అతి మామూలు పరికరాలు. ఒకానొక ప్రాదేశిక జీవనం నగరంలోకి దిగి వచ్చిన భ్రాంతిని కలిగిస్తున్నాయి. ఆ పరికరాల చప్పుళ్లు, వాటికి తోడుగా అర్థంకాని తాత్త్వికత వినిపిస్తుంది వేణువు. యూనివర్సిటీ గేటు ముందో పెద్ద సమూహం. స్టూడెంట్లు, జర్నలిస్టులు, కవులు, రచయితలు, శివం ప్రత్యేకంగా పిలిపించిన ఆహూతులు. ఆవాల్టి స్ట్రీట్ ప్లే కోసం ఓ పాతికమంది దాకా యువతీ యువకులు కొద్దిపాటి మేకప్‌తో ఆహుతుల మధ్య అటూ ఇటూ తిరుగుతున్నారు. స్ట్రీట్ ప్లేని సృష్టించడంలో దిట్ట శివం. జీవితంలోంచి ఒక దృశ్యాన్ని కత్తిరించి మన ముందుంచి నట్లుగా, సహజంగా సాగిపోయే సంఘటనల్లా ఉంటాయి అతని నాటకాలు.

"రా! నీకోసమే ఎదురు చూస్తున్నాం!" అంటూ ఆహ్వానించాడు శివం. మాలతికి తాను మళ్లీ నటించగలనా అని సందేహం!

"శివం మనసంతా బోలుగా, ఖాళీగా ఉంది. నా ముఖంలో ఇక భావాలు పలుకుతాయా? వద్దు శివం! ఈసారికి నన్నొదిలెయ్యి!" అంది దీనంగా.

"ఈ నాటకంలో నువ్వుండి తీరాలి. ఈ ఒక్కసారికి కాదనకు. మళ్లీ ఇంకెప్పుడూ నిన్ను విసిగించను," అంటూ స్క్రిప్టు చేతికందించి, మిగిలిన పాత్రధారుల వైపు వెళ్లాడు శివం.

స్క్రిప్టు చదివి కొయ్యబారిపోయింది మాలతి. అది తన కథే. తగలబడుతున్న అరణ్యాల కథ. డబ్బుకు, రాజకీయాలకు అమ్ముడుపోయిన స్వచ్ఛంద సంస్థల కథ. బుల్‌డోజర్లతో భూమిని, భూమిపుత్రుల్ని బలవంతంగా వేరు చేసిన కథ. ఎదిరించిన పురుషులను చిత్రహింసల పాలు చేసి, స్త్రీలను అమానుషంగా చెరిచిన కిరాతకుల కథ. 'అయ్యో శివం! ఎందుకిట్లా చేశావు! మానిందనుకున్న పుండును ఎందుకు రేపుతున్నావు?' స్క్రిప్టు కాగితాల్ని అట్లాగే విసిరి బయటకు పరుగెత్తాలనే కోరిక కలిగింది మాలతికి. లేచి, శివంవైపు అడుగులేస్తుండగానే మొదటి రంగం మొదలైంది.

రాజకీయ నాయకులు, ఫారెస్టు అధికార్లు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు నడుస్తూ గొప్ప ఆలోచనాముద్రను అభినయిస్తుం

టారు. బ్యాక్‌గ్రౌండ్‌లోంచి భారతదేశపు అడవుల గురించిన సంఖ్యలు, వివరాలు వినిపిస్తూ ఉంటాయి. "ఒక మహావిపత్తు నుండి ఈ దేశాన్ని రక్షించడానికి మనం ఇక్కడ సమావేశమయ్యాము. మనం కొన్ని కఠినమైన నిర్ణయాల్ని తీసుకోవాల్సి ఉంది. భవిష్యత్తు కోసం, ముందు తరాలవాళ్ల కోసం, భారతదేశ చిత్రపటం నుండి పచ్చదనం మాయమై పోకుండా ఉండటం కోసం మనమీ నిర్ణయాన్ని తీసుకుంటున్నాం. చిన్న మెట్ట అడవుల్ని రిజర్వుడు ఫారెస్టుగా ప్రకటిస్తున్నాం. అదికమీదట రక్షిత ప్రాంతం. చిన్న రెమ్మను కూడా అక్కణ్నుంచి గిల్లడానికి వీల్లేదు," అంటూ తీర్మానం వినిపిస్తుంటుంది. ఫారెస్ట్ అధికార్లు, ఎన్జీవోలు చప్పట్లు కొడుతుంటారు. 'పర్యావరణ రక్షణే మా లక్ష్యం,' అంటూ ఫారెస్ట్ అధికార్లు పిడికిలి బిగించి మార్చింగ్ చేస్తుంటారు.

శుష్కించిన శరీరాల్తో, ఖాళీ చూపులతో పల్లెల్లోని గిరిజనులు పోలోమంటూ స్టేజిపైకి వస్తారు. "మీకు స్థలాలిస్తాం! అడవులకు దూరంగా భూముల్ని కేటాయిస్తాం! రుణాలిప్పిస్తాం! భయం వద్దు! భయం వద్దు!" హామీలిస్తుంటాడో నాయకుడు. అప నమ్మకంతో, ముఖాల్లో వింత వింత భయాలతో వాళ్లు వెనక్కు వెళుతుంటారు. అదే సమయంలో గిరిజన స్త్రీ తలపైనున్న కట్టెల మోపుల్ని కిందకు లాగివేస్తుంటాడో ఫారెస్ట్ అధికారి. మరొకరు పురుషుల చేతుల్లోంచి చింతపండు మూటల్ని లాగి వేస్తుండగా మొదటి రంగం ముగుస్తుంది.

ఆ దృశ్యం ఎంత సహజంగా వచ్చిందంటే మాలతికి తెలియకుండానే అందులో లీనమైంది. లోపల గాయం, మరుగుతున్న కన్నీళ్లు క్షణంపాటు మరిచిపోయింది. ఉత్తే జితమైన నటిగా రూపాంతరం చెందింది. శివం ఈ మెటామార్ఫసిస్‌నంతటినీ గమనిస్తూనే ఉన్నాడు.

రెండవ భాగం మొదలైంది. అడవుల మధ్య ఫెళఫెళమంటూ మంటలు లేస్తాయి. పక్షులు జంతువులు భయ విహ్వాలతలో పరిగెత్తటం కనిపిస్తుంది. కోపంతో కందగడ్డలైన ముఖాల్తో ఫారెస్టు అధికార్లు. ఎఫ్ఐఆర్ కాగితాల్తో లాఠీలతో పోలీసులు వాళ్లను చుట్ట ముట్టుతారు. ఫోకస్ అనే బ్యానర్ ముందు పెట్టుకొని ఒక పదిమంది వాళ్ల మధ్యకు వస్తారు.

సూటు, హాటు, కళ్ళజోడు, యాంకీ భాషతో టి.కె.రావు ఉపన్యాసం చెబుతున్న వాడిలా ముందుకొస్తాడు. "హింస ద్వారా మనుషుల్ని మార్చటం అనేది ఇంతవరకు చరిత్రలో ఎక్కడా జరగలేదు. మాకో అవకాశం ఇవ్వండి. ఈ గిరిజనుల్ని మా ప్రేమతో, సేవతో మారుస్తాం! రాజ్యహింస, రాజ్యేతర హింస ఏదీ యిక్కడ కనబడటానికి వీల్లేదు. అందరూ వెళ్లిపోండి!" క్రమంగా ఫారెస్టు అధికార్లు, పోలీసులు బ్యాక్‌గ్రౌండ్‌లోకి వెళతారు. "లక్ష్మీ! వీళ్ళకో రాత్రి బడి ఏర్పాటు చెయ్యి. ప్రభాకరం! వీళ్ళకు రుణాలు అందే సదు

పాయం ఏర్పాటుచెయ్యి! రాజారావు! సూదులు, స్టెతస్కోపులు, మందులతో సంచార వైద్యశాలను ఏర్పాటు చెయ్యి! మాలతీ! వీళ్ళకోసం ఒక రంగస్థలాన్ని ఏర్పాటుచెయ్యి! కళ మనోవికాసానికి దోహదం చేస్తుంది," ఫోకస్ కార్యకర్తలు గిరిజనుల్తో కలిసి కొత్త జీవితాన్ని అవిష్కరిస్తున్న దృశ్యాలతో ఆ రంగం ముగుస్తుంది. మాలతి ఒక్కతే కంజెర వాయిస్తూ జానపద గీతం హమ్ చేస్తూ ఉంటుంది. గిరిజన స్త్రీలు ఆమె పాటను అనుసరించి నాట్యం చేస్తుంటారు. వెనుక నుండి మళ్లీ మంటలు లేస్తున్న దృశ్యం. జనం భయంతో అటూ ఇటూ పరిగెడుతుంటారు.

రెండో రంగం ముగిసేసరికి మాలతి చాలా ఉద్వేగంగా మారిపోయింది. జరిగిపోయిన సంఘటనల్లోకి మళ్లీ ప్రయాణించటం సరికొత్త అనుభవం. మాలతిలో వింత సంచలనం జరుగుతోంది. శివం నిజానికి నాటకాన్ని దర్శకత్వం వహించటం మానేసి, మాలతిలో జరిగే అంతర్మథనం గమనిస్తున్నాడు.

అప్పటికి బాగా చీకటిపడింది. యూనివర్సిటీ గేటుకు రెండువైపుల నున్న ఫ్లడ్‌లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. బయట రోడ్లపై వాహనాల సంచారం తగ్గినట్లుంది. చప్పుడు చెయ్యని ప్రేక్షకుల్లా ఉన్నాయి రోడ్లు. టైమ్‌మిషన్‌లోకి వెళ్లిన మనిషిలా మాలతి వింత అర్ణవంలోకి వెళ్లిపోయింది.

మూడవ రంగం మొదలైంది. ఈ రంగంలో మాలతే ప్రధానపాత్ర. పర్యావరణ రక్షణ సమితి అనే బ్యానర్ ఎగురుతూ ఉంటుంది. నాయకులు, అధికార్లు, పోలీసులు, ఫోకస్ కార్యకర్తలు, సమావేశపు భంగిమలో నిలబడి ఉంటారు. ఆలోచనాముద్రను అభినయిస్తూ అటూ ఇటూ తిరుగుతుంటారు. మాలతి రౌద్రమూర్తిలా ప్రత్యక్షం అవుతుంది. "ఇదంతా కుట్ర, స్మగ్లర్లు కలప వ్యాపారస్తులను స్థానిక రాజకీయ నాయకులు చేస్తున్న కుట్ర. ఇది గిరిజనులే చేస్తున్నారని ప్రజల్ని, ప్రభుత్వాన్ని భ్రమపెట్టి మళ్లీ ఈ అడవుల్ని డీ-రిజర్వు చేయించాలని వీళ్ల ప్రయత్నం. ఆ తరువాత యధేచ్ఛగా అడవుల్ని తెగ నమ్ముకోవాలని వీళ్ల దురాలోచన." మాలతి మాట్లాడుతుండగా, ఆమెను పదేపదే వారిస్తుంటాడు టి.కె.రావు. "షి యీజ్ యంగ్, ఇమ్మెచ్యూర్, యూనివర్సిటీల్లోంచి ఫ్రెష్‌గా ఇటు వచ్చింది. విషయ పరిజ్ఞానం తక్కువ. ఆమె మాటల్ని పట్టించుకోకండి!" వాద ప్రతివాదాలు, చర్చలు హోరాహోరీగా సాగుతుంటాయి. అంతా గందరగోళంగా ఉంటుంది. ఈ గందరగోళంలోంచి ఒక నాయకుడు లేచి, "ఇక లాభం లేదు. కఠినమైన నిర్ణయాలు తీసుకోక తప్పదు. బలవంతాన గిరిజనుల్ని అక్కడ నుంచి ఖాళీ చేయించండి!" అంటూ హిట్లరు మార్కు పోజులో అరుస్తాడు.

చిట్టచివరి రంగం. మాలతికెందుకో క్షణంపాటు జలదరింపు కలిగింది. మెదడో పొలరాయిడ్ కెమెరాలా అయిపోయి అవాల్టి సంఘటనలన్నీ చిత్రాలుగా బయట

కొస్తున్నాయి. డమడమమంటూ బుల్‌డోజర్లు, లారీల్లోంచి కిరాయి రౌడీలు, ఒక ఆర్త నాదం. పలుగొంతుకలు బాధాతీవ్రతలో మొర పెట్టుకోవటం, అటూ ఇటూ ఒకళ్ళ నొకళ్లు తొక్కుకుంటూ ప్రాణభీతితో పరిగెత్తటం, తన శరీరంపై పడ్డ మొరటు చెయ్యి, జుట్టు పట్టుకొని పొద మధ్యకు ఈడ్చుకెళ్లటం, అప్పటిదాకా అంతటా చీకటే. హింస రంగు చీకటి కాబోలు అనుకొంది. కానీ అంతలోనే భగ్గుమంటూ పైకి లేచాయి మంటలు. గుడిసెల్లోంచి లేచిన మంటలు, మంటల సాక్షిగా, తన శరీరాన్ని కరుస్తున్న రక్కసి ముళ్ల సాక్షిగా ఒకడు కాదు, ఇద్దరు కాదు పదిమంది వరుసగా తన శరీరం పై దాడి చెయ్యటం. "అన్నా చచ్చిపోతానన్నా! వదిలేయన్నా!" అంటూ పన్నెండేళ్ల బాలిక ఆ పక్క పొదలోంచి వేడుకోవటం తన చెవుల్లో పడుతోంది. అట్లా అరిచే శక్తి కూడా తను కోల్పోయింది.

అవన్నీ గుర్తుకొచ్చి మాలతి ముఖం మ్లానమైంది. కళ్ళలో నీళ్లు. మాలతి భుజంపై వెచ్చని స్పర్శ ఏదో తోచి వెనక్కు తిరిగింది. శివం. శివం కళ్ళలో అనురాగం. అమ్మతనం. శివం ఏం మాట్లాడలేదు. కానీ ఆ రాత్రిపూట ఫ్లడ్‌లైటు వెలుగులో శివం కళ్ళలోని జీవభాషను మాలతి చదవగలిగింది. మాలతిలో మళ్ళీ ఉత్తేజం రాజుకుంది.

బయట రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. రెండు ఉజ్వల నేత్రాల్లా ఫ్లడ్‌లైట్లు వెలుగుతున్నాయి. చిట్టచివరి రంగం కోసం ప్రేక్షకులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

స్క్రిప్టునొకసారి చదువుకొని స్టేజిపైకి వచ్చింది మాలతి.

*ఆహ్వానం ఆగస్టు 1995*